క్లుప్తంగా

నేడు బీసీల సమావేశం

మధురపూడి: రాజమహేంద్రవరంలోని ఆనం రోటరీ హాలులో గురువారం బీసీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు బీసీ నాయకుడు బర్ల బాబూరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి బీసీలందరూ హాజరుకావాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాక వెంగళరావు యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

జి.మామిడాడ విద్యార్థుల ప్రతిభ



హాసిని, జగన్నాథంను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసు, ఇతరులు

పెదపూడి: రాష్ట్ర స్థాయిలో ఇటీవల జరిగిన అండర్–14 బాస్కెట్‌బాల్ పోటీల్లో జి.మామిడాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ప్రథమ స్థానంలో నిలిచారని స్కూల్ హెచ్‌ఎం కె.శ్రీనివాసు తెలిపారు. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థులను ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు. చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరఫున అండర్–14 బాలుర విభాగంలో తిక్కాడ జగన్నాథం, అండర్–14 బాలికల విభాగంలో దడాల హాసిని పాల్గొన్న జట్లు రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచాయి. ఎంపీపీ కేతా తులసి, సర్పంచ్ లంక మున్ని, పీఈటీ ఐ.గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

నిత్యాన్నదానానికి వితరణ



వ్యాన్‌లో తరలిస్తున్న బియ్యం, కూరగాయలు

సీతానగరం: వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదానానికి సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీ నుంచి బియ్యం, కూరగాయలను తరలించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మట్ట శ్రీనివాస్ ఆధ్వర్యంలో 10 బియ్యం బస్తాలు, 20 కూరగాయల బస్తాలను వ్యాన్‌పై బుధవారం తీసుకువెళ్లారు. కార్యక్రమంలో నందమూరి వెంకటరమణ, కొమ్మిరెడ్డి సత్యనారాయణ, సత్తి భవాని పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా రామారావు



సీతానగరం: స్థానిక దుర్గాభవాని ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ మండల యూనియన్ అధ్యక్షుడిగా ఇనుగంటివారిపేటకు చెందిన వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ మండల ప్రెసిడెంట్ కుంచె అచ్యుత రామారావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సీతానగరం శివాలయం ఆవరణలో జరిగిన ఆటో యూనియన్ సభ్యుల సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. అచ్యుత రామారావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డు విస్తరణ పనుల అనంతరం ఆటోలు నిలుపుకోవడానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దృష్టికి తీసుకువెళ్లి, సమస్య పరిష్కారం చేయడానికి ఎనలేని కృషి చేస్తానన్నారు. గౌరవ అధ్యక్షుడు చిడిపి బంగారయ్య, దేవాబత్తుల గంగాధర, చిడిపి సుబ్రహ్మణ్యం, సభ్యులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ



పాపారావు, తహసీల్దార్

మధురపూడి: ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం కొనసాగుతున్నట్టు తహసీల్దార్ పాపారావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. అక్టోబర్ 27న ప్రారంభమైన ఈ కార్యక్రమం డిసెంబర్ 9వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. సవరణ కావాలనుకునే ఓటర్లు రెవెన్యూశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ విషయమై ప్రజావగాహన కోసం ర్యాలీలు, సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు.

32 వైద్యశిబిరాల నిర్వహణ



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

రాజానగరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలో 32 వైద్య శిబిరాలు నిర్వహించామని ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ సచివాలయం –1 వద్ద బుధవారం చివరి వైద్యశిబిరం జరిగింది. పాలచర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 604 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 179 మంది కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

జగన్ ప్రభుత్వంలో బీసీల సంక్షేమం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- 135 మంది కల్లు గీత కార్మికులకు పార్టీ సభ్యత్వం



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను సన్మానిస్తున్న గౌడ, శెట్టిబలిజ నాయకులు

రాజానగరం: రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. దివాన్‌చెరువులోని మార్గాని శ్రీను ఇంటి వద్ద బుధవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 135 మంది కల్లు గీత కార్మికులు సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయనిరీతిలో బీసీల సంక్షేమానికి 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఆయా కులాల వారికే నామినేటెడ్ పదవులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కల్లు గీత కార్మికుల సంక్షేమానికి సీఎం జగన్ శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వాలు వీరి సంక్షేమాన్ని విస్మరించడం వల్లనే చాలామంది ఇప్పటికీ కుల వృత్తిపైనే ఆధారపడి అనేక సమస్యలతో జీవనం సాగిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే కల్లు గీత కార్మికుల సంక్షేమానికి తీసుకున్న చర్యలను గుర్తు చేశారు. వీరితో పాటు ఇతర బీసీ కులాల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్న వైనాన్ని వివరించారు. చేయూత పథకం ద్వారా 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మహిళలకు ఏటా రూ.15 వేల సాయాన్ని అందిస్తూనే జగనన్న తోడు వంటి పథకాల ద్వారా సైకిలు, తోపుడు బళ్లపై చిరు వ్యాపారాలు చేసుకునేందుకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నారన్నారు. కల్లు గీత కార్మికుడు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం ఏర్పడినా వైఎస్సార్ గీత కార్మిక భరోసా పథకం ద్వారా రూ.10 లక్షల సాయం అందిస్తున్నారన్నారు. గ్రామంలో గౌడ, శెట్టిబలిజ సభ్యుల కోసం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం సమకూరిస్తే రూ.10 లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల గౌడ శాఖ అధ్యక్షుడిగా బుడ్డిగ వేణుగోపాలకృష్ణను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రకటించారు. ఇదే సమయంలో ఆయా కులాల సభ్యులు కృతజ్ఞతాపూర్వకంగా ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, వేమగిరి కృష్ణ, గ్రంధి నానబ్బులు, యర్రంశెట్టి, పోసుపో ప్లీడరు పాల్గొన్నారు.

సుపరిపాలన కోసం జగనన్నే మళ్లీ సీఎం కావాలి



పార్టీ జెండాను చేతబట్టి పర్యటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



రంగంపేట సచివాలయం వద్ద బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



బలభద్రపురంలో సచివాలయం-1 వద్ద డిస్‌ప్లే బోర్డు ప్రారంభించిన నాయకులు

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని, సుపరిపాలన కావాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం–5 పరిధిలో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా, పూర్తి పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలతో ప్రతి ఇంట సంక్షేమ కాంతులు వెల్లువిరుస్తున్నాయన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. సచివాలయం ఆవరణలో పార్టీ జెండాను ఎగురవేసి, సంక్షేమ లబ్ధి తెలిపే డిస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను చేతబట్టి సచివాలయ పరిధిలోని ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల అమలును వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి, భత్రాజుల కార్పొరేషన్ డైరక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, ఎంపీటీసీలు అంసూరి పద్మ, ఏడుకొండలు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ నాయకులు వాసంశెట్టి వెంకట్రావు తదితరుల పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

రంగంపేట: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు కోరారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం రంగంపేట గ్రామ సచివాలయం వద్ద బుధవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. జెడ్పీటీసీ రాంబాబు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. 2024లో ఎన్నికల్లో జగనన్నకు, వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకూ ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజా ప్రతినిధులు వివరించారు. సంక్షేమ పథకాల బోర్డును ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీ జెండాను మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు వలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్‌ను అందించారు. ఆయా కుటుంబాలు పొందిన లబ్ధి, ఇతర వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, సొసైటీ అధ్యక్షుడు పోతుల బులివీర్రాజు, మండల జేసీఎస్ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, మండల క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కుసుమంచి కష్ణంరాజు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగే ప్రభుత్వ లక్ష్యం

బిక్కవోలు: నిరుపేదలకు అన్నివిధాల సంక్షేమాన్ని అందించి, వారి జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ అన్నారు. బుధవారం మండలంలోని బలభద్రపురం గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగున్నరేళ్ల కాలంలో అమలు చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును సచివాలయం–1 వద్ద ఆవిష్కరించారు. అప్పాజీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడ ప్రారంభించారని వివరించారు. పార్టీలకతీతంగా పేదలందరికీ పథకాలు అందేలా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్టు పేర్కొన్నారు. మళ్లీ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుంగా రామారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పెదపూడి: రాష్ట్రంలో ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, అందువల్లే రాష్ట్రానికి మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పెదపూడి గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని బుధవారం నోడల్ ఆఫీసర్ ఎం.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఏ పథకాలతో లబ్ధి పొందిన వారి వివరాలు తెలిపే సంక్షేమ, అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును సచివాలయం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. వలంటీరు ఇంటింటికీ తిరిగి పథకాల్లో లబ్ధిదారులు పొందిన లబ్ధి, అర్హులైన వారి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సమ్మంగి దుర్గాప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, సచివాలయ కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధ కృషితో లక్ష్య సాధన



అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలంటే తపనతో పాటు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 'ఆరంభ్ 2 కె 23' పేరిట నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సివిల్ సర్వీసెస్‌పై తన అనుభవాలను వివరిస్తూ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాలలోను ముందంజ వేస్తున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న 33 శాతం రిజర్వేషన్లతో రాజకీయాలలో కూడా రాణించాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. కళాశాల చైర్మన్ కె.ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్‌కి వెళ్లాలనే సంకల్పం ఉన్న విద్యార్థినులను తాము ప్రోత్సహిస్తున్నామని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటుచేశామన్నారు. అనంతరం విద్యార్థినుల ఫ్యాషన్ షో, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో నాక్ సలహాదారు పీవీ రమేష్, వైస్ చైర్మన్ కె.అనూషా రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరావు పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- రాజంపేటలో గడప గడపకూ..



రాజంపేటలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేటలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా వారికి కలిగిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యుదయానికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన వారందరిని గుర్తించి, పారదర్శకంగా పథకాలు అందజేస్తున్నారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, పార్టీ నాయకులు కవల కృష్ణమూర్తి, పెరుగు వీరభద్రరావు, రాచూరి గోవింద్, కవల వెంకటేష్, రేఖపల్లి వీర

అభివృద్ధిని చూసి మళ్లీ పట్టం కట్టాలి

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



అచ్యుతాపురంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ప్రజలు వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని అచ్యుతాపురంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, సర్పంచ్ బత్తుల శ్రీను, ఎంపీటీసీ కొత్తపల్లి బుజ్జి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, ఆకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాపనాశనం.. శివనామ స్మరణం



అనపర్తి శివాలయ ఆవరణలో శివలింగాకృతిలో దీపాలంకరణ

అనపర్తి: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా శైవక్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు శివ, కేశవుల ఆలయాల వద్ద బారులు తీరి స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, కేదారేశ్వర నోములు, ప్రత్యేక హోమాది క్రతువులు నిర్వహించారు. స్థానిక పాతవూరులోని ఉమా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం లక్ష బిల్వార్చన, మహాలింగార్చన, రుద్రహోమాది క్రతువులు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో, చందుశర్మ పర్యవేక్షణలో ఈ పూజాది కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో శివలింగాకృతిలో ఏర్పాటు చేసిన దీపాలంకరణ ఆకట్టుకుంది.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



సీతానగరం గ్రంథాలయంలో వేడుకలు

సీతానగరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు బుధవారం సీతానగరం గ్రంథాలయంలో లైబ్రేరియన్ తేలి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అలాగే డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయురాలు మల్లిక, సీతానగరం పుస్తక నిక్షిప్త కేంద్రం నిర్వాహకురాలు బి.అరుణ కుమారి విద్యార్థులతో గేయాలు ఆలపింపజేశారు.

కోరుకొండలో ర్యాలీ

మధురపూడి: కోరుకొండ శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ కార్యదర్శి మారిశెట్టి సత్యనారాయణ రిబ్బన్ కట్ చేసి, వీటిని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. వి లవ్ రీడింగ్ అని నినాదాలు చేస్తూ విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోరుకొండ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ జూలీ, స్థానిక శిరిడీ సాయి స్కూల్ సచిన్ కుమార్, సిద్ధార్థ స్కూల్ టీచర్ పావని, గాదరాడ పుస్తక నిక్షిప్త నిర్వాహకులు కందికట్ల ఆనంద కుమార్, శ్రీరంగపట్నం నిర్వాహకులు బొడ్డేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెండో రోజు పుస్తక ప్రదర్శన

బిక్కవోలు: పుస్తకం ప్రాముఖ్యంపై కొంకుదురు శాఖా గ్రంథాలయం వద్ద విద్యార్థులకు లైబ్రేరియన్ నందికొళ్ల బాల అవగాహన కల్పించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రెండో రోజైన బుధవారం పుస్తక ప్రదర్శన జరిగింది. విద్యార్థులకు, పాఠకులకు కథలు, కథనాలు, వైజ్ఞానిక విషయాలు, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ వంటి పుస్తకాలను ప్రదర్శించారు.

రాజానగరం: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన జరిగింది. విజ్ఞాన వికాసానికి పుస్తక పఠనం ఏవిధంగా తోడ్పడుతుందో పలువురు వక్తలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడ చక్రి, స్థానిక పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

గోకవరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గోకవరం శాఖ గ్రంథాలయం అధికారి కె.ప్రియదర్శిని ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేశారు. చదువంటే మా కిష్టం నినాదాలు చేశారు. అనంతరం గ్రంథాలయంలో మోటివేషనల్ స్పీకర్ తీగల శివాజీ విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ, పుస్తక పఠన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

విజ్ఞాన కేంద్రాలుగా గ్రంథాలయాలు

రంగంపేట: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే విజ్ఞాన కేంద్రాలు గ్రంథాలయాలని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎం సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ నల్లమిల్లి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయి. విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీలను హెచ్‌ఎం ప్రారంభించారు. ముందుగా గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

ఇబ్బందుల్లేకుండా సాగు నీరు అందించాలి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రబీ పంటకు సంబంధించిన రైతులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఇరిగేషన్ ఉన్నతాధికారులను కోరారు. బుధవారం జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ పంటకు సాగునీరు అందించే క్రమంలో వారికి ఎప్పటికప్పుడు సమాచారం అందించడంతో పాటు, నీటిని పొదుపుగా వినియోగించడంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా సాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని వాటర్ స్టోరేజ్ కెపాసిటీని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో రూ.6 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. భవనంలో కల్పిస్తున్న వసతులు, ఇతర నిర్మాణాలను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్ నెలాఖరు నాటికి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, పెనుగొండ సత్యానందం, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, తోలేటి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ అనంతరం పల్మనాలజీకి ప్రాధాన్యం



జీఎస్‌ఎల్ ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

రాజానగరం: కోవిడ్ వైరస్ అనంతరం పల్మనాలజీ (ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన చికిత్స) ప్రాధాన్యం పెరిగిందని జీఎస్‌ఎల్ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి అన్నారు. ప్రపంచ సీవోపీడీ (క్రానిక్ అబ్ స్ట్రక్టివ్ పల్మనాలజీ డిసీజెస్) దినోత్సవం సందర్భంగా కాలేజీ రెస్పిరేటరీ డిపార్టుమెంట్, ఐఎస్‌సీసీఎం (ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మేనేజ్మెంట్) రాజమహేంద్రవరం బ్రాంచ్ ఆధ్వర్యంలో జీఎస్‌ఎల్ వైద్య కళాశాలలో బుధవారం సాయంత్రం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సోమనాథ్‌దాస్, రెస్పిరేటరీ మెడిసిన్ ప్రొఫెసర్ రాఘవేంద్రరావు పల్మనాలజీ సమస్యలు, ప్రాణాంతకమయ్యే సమస్యలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తొలుత ప్రాంగణంలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని తెలియజేశారు.

మణికంఠ స్వామికి పంచామృతాభిషేకం

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన మణికంఠ స్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా మహాలక్ష్మి గణపతి హోమం, ప్రత్యేక, అష్టోత్తర పూజలు చేశారు. స్వామి వారి దర్శనానికి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రధానార్చకుడు నారాయణనంబూద్రి స్వామివారికి విశేష పూజలు చేశారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

రాజానగరం: దివాన్‌చెరువులోని హరేరామ సేవా విశాల సహకార పరపతి సంఘంలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు చైర్‌పర్సన్ గంగిశెట్టి సోమేశ్వర్రావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సహకార రంగం ద్వారా వ్యవసాయరంగం అభివృద్ధికి అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పర్సన్లు చప్పిడి సూర్యచంద్రప్రకాష్, గారబోయిన సత్యనారాయణ, సీఈఓ జుట్టా త్రిమూర్తులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక దీపోత్సవం

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా దీపోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈనెల రోజులు ఈ కార్యక్రమం జరుగుతుంది. స్వామివారి పాదాల నుంచి కొండపై వరకూ 620 మెట్లపైనా, కొండపైన ప్రాకారమంతా దీపాలు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి భక్తుల సహకారంతో ఈ కార్యక్రమం మొదలైంది.

ఉచిత శిక్షణ ప్రారంభం

రంగంపేట: పాత కోటపాడు గ్రామంలో మహిళలకు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. రాజానగరం మండలం దివాన్‌చెరువుకు చెందిన డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ మేనేజింగ్ ట్రస్టీ సుంకర వీరాస్వామి తెలిపారు. సంస్థ అధినేత సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 50 మంది మహిళలకు వెలుగుబంద గ్రామానికి చెందిన సంస్థ సభ్యులు శిక్షకులుగా వ్యవ